

డీజిల్‌లో నీళ్లు!

పెట్రోల్ బంక్‌లో డీజిల్‌కు బదులు నీళ్లు వచ్చాయని వినియోగదారులు బంక్ వద్ద ఆందోళనకు దిగారు. 10లో▸



నిండు ప్రాణం బలి

బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ఓ యువకుడు స్వగ్రామానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో విగతజీవిగా మారాడు. 10లో▸



స్టడీ టూర్‌కు ఎమ్మెల్యే

స్టడీ టూర్‌లో భాగంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుక్రవారం నల్లమల పర్యటనకు వెళ్లారు. 10లో▸

న్యూస్‌రీల్

కబ్జా చెర నుంచి ప్రభుత్వ భూమికి రక్షణ



అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూమి అని ఏర్పాటు చేసిన బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

బడంగ్‌పేట్: బాలాపూర్ ఏఆర్‌సీఐ రోడ్డులోని సర్వే నంబర్ 74లో సుమారు రూ.20 కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమికి రెవెన్యూ అధికారులు అక్రమార్కుల చెర నుంచి రక్షణ కల్పించారు. 'సాక్షి'లో వచ్చిన వరుస కథనాలకు స్పందించిన అధికారులు శుక్రవారం చర్యలకు ఉపక్రమించారు. సుమారు 2.5 ఎకరాలను కబ్జాదారుల చెర నుంచి కాపాడారు. రెండు రోజుల పాటు సర్వే నిర్వహించి సదరు స్థలం ప్రభుత్వ భూమి అని నిర్ధారించారు. తహసీల్దార్ మాధవిరెడ్డి ఆదేశాలతో సిబ్బంది జేసీబీ సాయంతో అందులో నిర్మాణాల కోసం తవ్విన పునాదులను పూడ్చివేసి, నిర్మించిన బేస్‌మెంట్, ప్రహరీలను నేలమట్టం చేశారు. ఇది ప్రభుత్వానికి చెందిన భూమి అని హెచ్చరిక బోర్డు పాతారు. కబ్జాదారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

'ఉన్నతి శిక్షణ'కు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నంరూరల్: మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల మహిళలు ఉన్నతి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీలత తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల లోపు మహిళలకు ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మగ్గం వర్క్‌లో 30 రోజుల శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. మహిళలు ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పని దినాలు పూర్తి చేసి ఉండాలని, పదో తరగతి వరకు చదివి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రోజుకు రూ.300 చొప్పున స్టైఫండ్, ఉచిత భోజనం, యూనిఫాం ఇస్తారని చెప్పారు. శిక్షణ పూర్తయిన తర్వాత ధ్రువపత్రం జారీ చేస్తారన్నారు. ఆసక్తిగల మహిళలు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఏపీడీ ఇబ్రహీంపట్నం 91814 87055, ఏపీఓ మంచాల 92814 87145, ఏపీఓ యాచారం 92814 87174 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫిజికల్ డైరెక్టర్ల సమస్యలు పరిష్కరించండి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


చేవెళ్ల: తెలంగాణ మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. సంఘం కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం సచివాలయంలో మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు జీఓ 254 ప్రకారం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రాలు విడిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లను ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్‌లోకి మార్చి మినిమం టైమ్స్ స్కేల్ ఇస్తున్నారన్నారు. తెలంగాణలో కూడా అదే విధంగా అమలు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి వెంటనే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో మాట్లాడినట్లు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం సభ్యులు శ్రీనునాయక్, కృష్ణారెడ్డి, వెంకట్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

జెడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ శశాంక బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ పాలక వర్గం పదవీ కాలం పూర్తి కావడంతో కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన శుక్రవారం జిల్లా పరిషత్‌కు చేరుకొని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో కృష్ణా రెడ్డి, ఇతర అధికారులు కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

డేంజర్ బెల్!

గ్రేటర్‌లో మళ్లీ డెంగీ పంజా!!



బస్తీల్లో కనిపించని ఫాగింగ్ జాడ

- విజృంభిస్తున్న దోమలు
- నగరంలో మూడు నెలల్లో 114..
- రంగారెడ్డి జిల్లాలో 51..
- మేడ్చల్– మల్కాజిగిరిలో 108 కేసులు
- జాగ్రత్తలు అవసరమని సూచిస్తున్న వైద్యులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: విశ్వనగరం.. అంతర్జాతీయ నగరం.. గ్రేటర్ హైదరాబాద్.. చిన్న దోమ పేరు చెబితే చాలు గజగజ వణికిపోతోంది. కోవిడ్ నియంత్రణలో భాగంగా మూడేళ్ల పాటు వీధుల్లో ఫాగింగ్ నిర్వహించే వారు. ప్రస్తుతం బస్తీల్లో ఫాగింగ్ చేస్తున్న దాఖలాలు లేకపోవడంతో మళ్లీ దోమలు విజృంభిస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా సిటిజన్లపై దాడి చేస్తున్నాయి. మంచినీటిలో పెరిగే ఎడిస్ ఈజిప్టే దోమ కుట్టడంతో ఎంతో మంది డెంగీ జ్వరాల బారినపడుతున్నారు. వైద్యారోగ్యశాఖ అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటి వరకు హైదరాబాద్ జిల్లాలో 114, మేడ్చల్ జిల్లాలో 108, రంగారెడ్డి జిల్లాలో 51 కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా బాధితుల సంఖ్య రెట్టింపు ఉన్నట్లు అంచనా. హైదరాబాద్ జిల్లాలో మే నెలలో 39, జూన్‌లో 56, జూలైలో కేవలం నాలుగు రోజుల్లోనే 19 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం నగరంలోని ఫీవర్ ఆస్పత్రి సహా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీకి వస్తున్న బాధితుల్లో మెజారిటీ బాధితులు జ్వర పీడితులే కావడం గమనార్హం. ప్రతి పది మంది జ్వరపీడితుల్లో ఇద్దరు నుంచి ముగ్గురు డెంగీతో బాధపడుతున్నట్లు నిర్ధారణ అవుతోంది.

పూల కుండీలే దోమలకు నిలయాలు

సాధారణ బస్తీలతో పోలిస్తే సంపన్నులు ఎక్కువగా నివసించే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, నార్సింగి, మణికొండ, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ సహా శివారు మున్సిపాలిటీల్లోని గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, బహుళ అంతస్తుల భవనాల్లో నివసిస్తున్న వారే ఎక్కువగా డెంగీ జ్వరాల బారినపడుతున్నట్లు వైద్యుల పరిశీలనలో వెల్లడైంది. ఇంటి ఆవరణలో షో కోసం పెంచే మనీ ప్లాంట్స్, ఇతర పూల మొక్కలు డెంగీ దోమలకు నిలయంగా మారుతున్నాయి. చెట్ల పొదళ్ల మధ్య చెత్తా చెదారం పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. కుండీల్లోని నీటిని తొలగించకపోవడంతో డెంగీ దోమలకు నిలయంగా మారుతున్నాయి. కొత్త నిర్మాణాల్లో క్యూరింగ్ కోసం వాడిన నీరు గదుల్లో నిల్వ ఉండి దోమలకు నిలయంగా మారుతోంది. వాటర్ ట్యాంకులు, ఇంటిపై ఉన్న టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ డబ్బాల్లోనూ నీరు చేరి దోమలు విజృంభిస్తున్నాయి.

'క్యాష్' చేసుకుంటున్న వైద్యులు

డెంగీని రెండు పద్ధతుల్లో నిర్ధారిస్తున్నారు. ఎన్ఎస్1 యాంటిజెన్, ఐజీఎం ఎలిసా టెస్టు ద్వారా డెంగీని నిర్ధారిస్తుంటారు. ప్రైవేటు వైద్యులు ర్యాపిడ్ ఎన్ఎస్1 యాంటిజెన్ టెస్టును ప్రమాణికంగా తీసుకుంటుండగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వైద్యులు మాత్రం ఐజీఎం ఎలిసా టెస్టును ప్రామాణికంగా తీసుకుని చికిత్సలు చేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లోని వైద్యులు సాధారణ జ్వరాలను కూడా డెంగీ పాజిటివ్‌గా చూపించి, ప్లేట్ లేట్ కౌంట్, ఐసీయూ చికిత్సల పేరుతో హడావుడి చేస్తున్నారు. నిజానికి డెంగీ బారిన పడిన రోగుల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తెలియజేయాల్సి ఉంది. కానీ కార్పొరేట్/ ప్రైవేటు ఆస్పత్రుల్లోని వైద్యులు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా గుట్టుగా చికిత్సలు చేస్తున్నారు. రక్త కణాల సంఖ్య తగ్గిపోయిందని చెప్పి, రోగులతో పాటు వారి వెంట వచ్చిన బంధువులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. రోగుల భయాన్ని కొంత మంది వైద్యులు క్యాష్ చేసుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్ కౌంట్, ఐసీయూ చికిత్సల పేరుతో అడ్డగోలుగా బిల్లులు వసూలు చేస్తున్నారు.

అన్ని జ్వరాలూ డెంగీ కాదు



ప్రస్తుతం సీజన్ మారింది. వాతావరణంలోనూ అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అయితే.. అన్ని జ్వరాలూ డెంగీ జ్వరాలు కాదు. దోమ కుట్టడం ద్వారా డెంగీ సోకుతుంది. ఇది పగటి పూట మాత్రమే కుడుతుంది. దోమ కుట్టిన 7 నుంచి 8 రోజులకు హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కళ్లు కదలించలేని పరిస్థితి ఉంటుంది. ఎముకలు, కండరాల్లో భరించ లేని నొప్పి, శరీరంపై ఎర్రటి పొక్కులు వస్తాయి. రక్త కణాలు (ప్లేట్స్‌లెట్స్) సంఖ్య పడిపోతుంది. కొన్నిసార్లు అవయవాలన్నీ పనిచేయడం మానేస్తాయి. ఐజీఎం ఎలిసా టెస్టును డెంగీకి ప్రామాణికంగా తీసుకోవాలి. లక్షణాలు గుర్తించిన వెంటనే చికిత్స తీసుకోవాలి. డోలో 650 వంటి సాధారణ మందులతోనూ డెంగీ నుంచి బయటపడొచ్చు.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సీజనల్‌'పై జాగ్రత్త

వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం కావాలి

- ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలి
- మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ శశాంక ఆదేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వర్షాల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టడంతోపాటు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ కె.శశాంక అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్యారోగ్య అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, విషజ్వరాలు, మెదడువాపు వంటి వాటిని అరికట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ సంసిద్ధంగా ఉండాలని అన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా మున్సిపల్ పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా నీరు నిల్వ ఉండే చోట ఆయిల్ బాల్స్ వేయాలని, దోమలు రాకుండా ఫాగింగ్ చేయాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రతిరోజు జ్వరాలపై నివేదిక సమర్పించాలని సూచించారు. ఏదైనా ప్రాంతంలో జ్వరం కేసులు ఎక్కువగా వచ్చినట్లయితే తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. ప్రతి శుక్రవారం 'డ్రై'డే పాటించాలని.. ఇళ్లు, సంస్థల్లో కార్యక్రమం చేపట్టి నిల్వ నీటిని బయట పారబోసి దోమలు రాకుండా చూసుకోవాలన్నారు. డెంగీ జ్వరాలు రాకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత చేపట్టాలన్నారు. ఎక్కడైనా కేసులు వస్తే ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్బీఎస్కే బృందాలు జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలను నిరంతరం సందర్శించి విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించాలని ఆదేశించారు. పాఠశాలల్లో సైన్స్ టీచర్ల ద్వారా విద్యార్థులకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేలా చూడాలని విద్యా శాఖ అధికారికి సూచించారు. పల్లెల్లో వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ ప్రత్యేకాధికారుల ద్వారా చర్యలు చేపట్టాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారికి తెలిపారు. మున్సిపాలిటీల్లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్ రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

82.5 లక్షల మొక్కలు లక్ష్యం

వజ్రోత్సవ వనమహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం లో శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమంపై అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ వనమహోత్సవాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాలు, పొలాల గట్లపై 82.5 లక్షల మొక్కల నాటేలా దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేలా చొరవ చూపాలని ఆదేశించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున విరివిగా మొక్కలు నాటాలని, నిర్ణీత గడువు లోపు లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. లక్ష్య సాధన కోసం అనువైన స్థలాలను గుర్తిస్తూ మొక్కలు నాటడంతో పాటు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని, ఏకకాలంలో ఈ పనులు జరగాలని ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాలతో పాటు, చెరువులు, ప్రభుత్వ స్థలాలు, కాలువ కట్టలపైనా పెద్ద ఎత్తున మొక్కలు నాటి, సంరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కలు అందించాలన్నారు. రానున్న మూడు వారాల్లోపు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వంద శాతం మొక్కలు నాటించాలని గడువు విధించారు. కార్యక్రమం ప్రగతి గురించి రోజువారీగా నివేదికలు సమర్పించడంతో పాటు వివరాలను వెంటనే ఆన్‌లైన్లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను సైతం భాగస్వాములను చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని, గ్రామీణ ప్రాం తాల్లో మండల ప్రత్యేకాధికారులను భాగస్వాములు చేయాలన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ సుధాకర్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీలత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బూర దిలీప్‌గౌడ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ నోటిఫికేషన్ లేక లక్షలాది మంది యువకులు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లాలో అక్రమ టీచర్ల బదిలీలను నిలిపివేయాలని అన్నారు. డబ్బులు తీసుకొని బదిలీలు చేస్తున్నారని, అవినీతికి పాల్పడుతున్న డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిరుద్యోగ సమస్యలను పరిష్కరించేవరకు పోరాటం ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నోముల దయానంద్, లచ్చిరెడ్డి, అశోక్, భగీరథ, పగడాల శ్రీశైలం, పాండు, యాదగిరిరెడ్డి, శ్రీనివాస్, విశ్వనాథ్‌గౌడ్, బీరప్ప, రాఘవేందర్, శివ, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

భూ సేకరణలో.. అవకతవకలు!

సిద్ధాపూర్ భూముల వ్యవహారం

- ఓ ప్రజాప్రతినిధి, మరో అధికారి కనుసన్నల్లో ప్రక్రియ
- తప్పుల తడకగా జాబితా
- పరిహారం పేరిట పలహారం
- గత ప్రభుత్వంలో పట్టించుకోని ఉన్నతాధికారులు
- ప్రస్తుత ఎమ్మెల్యే ఫిర్యాదుతో తిరిగి విచారణ

కొత్తూరు: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2020లో మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో జరిగిన భూసేకరణలో భారీగా అవకతవకలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పట్లోనే రైతులు, ఆయా పార్టీలకు చెందిన నాయకులు భూసేకరణ ప్రక్రియను అధికారులు పారదర్శకంగా చేపట్టడం లేదంటూ ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టారు. గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి, నియోజకవర్గ అధికారి కనుసన్నల్లోనే తప్పుల తడకగా జాబితా రూపొందించినప్పటికీ ఉన్నతాధికారులు, అప్పటి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇటీవల రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సిద్ధాపూర్ భూముల సేకరణలో అవకతవకలపై మరోసారి విచారణ జరిపించాలని కోరడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

ఇదీ భూసేకరణ..

గత ప్రభుత్వం 2020లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం సిద్ధాపూర్‌లో సర్వే నంబర్లు 252, 278, 361లో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములకు సంబంధించి 330.34 ఎకరాలు సేకరించి టీజీఐఐసీకి బదలాయించింది. ఇందులో సుమారు 97.24 ఎకరాలు ప్రభుత్వ పొలం కాగా 160 ఎకరాలు అసైన్డ్, మిగితా 73.1 ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. అప్పటి ప్రభుత్వం అసైన్డ్ రైతులకు ఎకరానికి రూ.10.50 లక్షలు పరిహారంగా అందజేసింది.

అవకతవకలపై ఆరోపణలివీ..

- ప్రభుత్వం ఫుడ్‌ప్రాసెసింగ్‌కోసం సేకరించిన మొత్తం 330.34 ఎకరాల్లో 150 నుంచి 160 ఎకరాల్లో మాత్రమే అసైన్డ్ రైతులు ఉన్నారు.
- ఈ విస్తీర్ణానికి మాత్రమే రైతులకు పరిహారం అందించాలి.
- కానీ అధికారులు 240 ఎకరాలకు అందించినట్లు రికార్డుల్లో పేర్కొంటున్నారు.
- వాస్తవంగా సుమారు 15 మంది అసైన్డ్ రైతులకు తాము సాగు చేస్తున్న 25 ఎకరాలకు ఇప్పటికీ పరిహారం అందలేదు. వారు నేటికీ ఇదే పొలాల్లో సాగు చేస్తూ కబ్జాలో ఉన్నారు.
- మరికొంత మంది రైతులకు రికార్డుల ప్రకారం 3 ఎకరాలుంటే ఎకరానికి మాత్రమే పరిహారం అందించారు.
- అసైన్డ్ పట్టాలు, కబ్జాలో లేని వారికి మాత్రం రెండు, మూడెకరాలకు కూడా పరిహారం అందినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి, అధికారి తప్పుల తడకగా జాబితా రూపొందించి భూసేకరణ పేరిట కోట్లలో దోచుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
- అధికారుల తీరుతో నిజమైన అసైన్డ్ రైతులకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు.



ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల కోసం సేకరించిన పొలం

ఇప్పటికే అధికారులు, మంత్రికి ఫిర్యాదులు

గత ప్రభుత్వం సిద్ధాపూర్‌లో చేపట్టిన భూసేకరణలో భారీగా అవకతవకలు చోటు చేసుకున్నాయి. కొందరు నాయకులు కుట్రతో తప్పుడు జాబితాను తయారు చేసి పరిహారాన్ని కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం విజిలెన్స్, ఇతర శాఖల అధికారులు, రెవెన్యూ మంత్రికి ఫిర్యాదు చేశాం. భూసేకరణపై విచారణ చేసి పరిహారాన్ని కాజేసిన వ్యక్తుల నుంచి రికవరీకి చర్యలు తీసుకుంటాం.



– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

పింఛన్ల పెంపును విస్మరించడం తగదు

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెన్షన్లు పెంచాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.6 వేలు, మహిళలకు రూ.4వేల పెన్షన్ అందజేయాలన్నారు. అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచుతామని చెప్పి మాట మరిచారన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించినట్లు దివ్యాంగులకు సైతం అనుమతించాలన్నారు. రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్ (పీహెచ్‌డీ) వయసు, నెట్ నుంచి దివ్యాంగులందరికీ మినహాయింపు ఇవ్వాలని కోరారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే అన్ని ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ శశాంకకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు, శ్రీనివాస్‌నాయక్, రాజు, జంగయ్య, బాలరాజ్, గువ్వల యాదయ్య, ఎంఆర్‌పీఎస్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు జుట్టు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దక్షిణభారత ఆరెకటిక సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం రూరల్: దక్షిణ భారత ఆరెకటిక సంఘం అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నానికి చెందిన డబ్బికార్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి ఆరెకటిక సమాజ్ ప్రతినిధులు ఢిల్లీలో శుక్రవారం సమావేశమయ్యారు. ఇందులో డబ్బికార్ శ్రీనివాస్‌ను దక్షిణ భారత ఆరెకటిక సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆయన్ని కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి వీరేంద్రకుమార్ అభినందించారు. కటిక సంఘం సంక్షేమం, అభివృద్ధి కోసం పోరాడుతానని తెలిపారు. దేశంలో కటికల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తానని స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నానికి చెందిన వ్యక్తికి ఇంత పెద్ద పదవీ వరించడం అభినందనీయమని సంఘం నాయకుడు రవి పేర్కొన్నారు.

అవయవాల తరలింపునకు గ్రీన్ చానల్

బంజారాహిల్స్: రోగికి అవయవాల తరలింపు కోసం బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ఉదయం గ్రీన్‌చానల్ ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి నుంచి హైటెక్ సిటీ యశోద హాస్పిటల్‌కు ఓ రోగికి అమర్చేందుకు జీవన్‌దాన్ ఆధ్వర్యంలో లంగ్స్ తరలింపు ప్రక్రియ ఉదయం 10.45 గంటలకు బంజారాహిల్స్ నుంచి కొనసాగింది. ఇందు కోసం బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ గ్రీన్‌చానల్ ఏర్పాటుచేసి అవయవాలను తీసుకెళ్తున్న అంబులెన్స్‌కు దారి సుగమం చేశారు. మూడు నిమిషాల్లోనే ఈ అంబులెన్స్ బంజారాహిల్స్ నుంచి హైటెక్ సిటీ వైపు వెళ్లగలిగింది. 45 సంవత్సరాల బల్లా సరస్వతి అనే రోగికి లంగ్స్ అమర్చే క్రమంలో ఈ గ్రీన్‌చానల్ ఏర్పాటుచేశారు.

డీజిల్‌లో నీళ్లు!

- మొరాయించిన వాహనాలు
- ఆందోళనకు దిగిన వినియోగదారులు



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మనోహర్ రాథోడ్

తుర్కయంజాల్: డీజిల్ బంక్‌లో డీజిల్‌కు బదులు నీళ్లు వచ్చాయని మన్నెగూడలోని సాయిబాబ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ఇద్దరు వినియోగదారులు ఆందోళనకు దిగిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సంఘటన వివరాల ప్రకారం తుర్కయంజాల్‌కు చెందిన కంకలి కృష్ణ ఉదయం 7.30 గంటల సమయంలో ట్రాక్టర్‌లో రూ.3,400 డీజిల్ కొట్టించాడు. ట్రాక్టర్ పొలం వరకు కూడా వెళ్లకుండానే మొరాయించడంతో మెకానిక్ దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడ ఇంజన్‌ను పరిశీలించగా డీజిల్ ట్యాంక్‌లో నీళ్లు ఉన్నట్లు గుర్తించారు. ఉదయం 7.40 నిమిషాలకు ఇదే బంక్‌లో జంపాల రవీందర్ తన కారులో రూ.4వేల డీజిల్ కొట్టించాడు. కారు 20 కిలోమీటర్ల దూరం కూడా ప్రయాణించకుండానే ఇబ్రహీంపట్నం సమీపంలో నిలిచిపోయింది. వెంటనే మెకానిక్ వద్దకు వెళ్లగా డీజిల్ ట్యాంక్‌లో నీళ్లు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే రెండు వాహనాల యజమానులు ఒకరి తర్వాత మరొకరు బంక్ వద్దకు చేరుకున్నారు.



ట్రాక్టర్‌లో నుంచి తీసిన నీళ్లతో కలిసిన డీజిల్

ఈ విషయంపై సిబ్బందిని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. వెంటనే జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మనోహర్ రాథోడ్, విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని శాంపిళ్లు సేకరించారు. డెన్సిటీలో పెద్దగా తేడాలు లేకపోవడంతో నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తామని చెప్పారు. వాహనాలు బంక్‌లో ఉన్నంత వరకే తమ బాధ్యత అని, బయటకు వెళ్లి వచ్చాక ఏం జరిగిందో తమకు తెలియదని, దీన్ని పరిశీలించలేమని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. ఆ తర్వాత రెండు వాహనాల మరమ్మతులకు అయ్యే ఖర్చు భరిస్తామని యజమానులు చెప్పడంతో విషయం సద్దుమణిగింది.

కూలీ పనికి వెళ్తుండగా ప్రమాదం

మహిళ చేయి మీదుగా వెళ్లిన స్కూల్ బస్సు

మొయినాబాద్: టీవీఎస్ ఎక్సెల్ లూనా అదుపు తప్పడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన కుడావత్ బోడుక, మున్ని భార్యాభర్తలు. వీరు నగరంలోని గౌలిపురాలో ఉంటూ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ఉదయం పనినిమిత్తం నాగిరెడ్డిగూడకు వెళ్తుండగా శ్రీనిధి పాఠశాల వద్దకు రాగానే లూనా అదుపుతప్పి దంపతులు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో అజీజ్‌నగర్ నుంచి కాళీ మందిర్ వైపు ప్రయాణిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు అతివేగంగా మహిళ చేతి మీదుగా వెళ్లింది. దీంతో ఆమె ఎడమ చేయి విరిగిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

మరో ఏడుగురి బైండోవర్



పోలీసుల అదుపులో సభావత్ దేవ్లా

మాడ్గుల: సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు బైక్‌ను సీజ్ చేశారు. ఈ ఘటన మాడ్గుల మండలం సంద్రలగడ్డ, అప్పారెడ్డిపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆమనగల్లు ఎక్సైజ్ శాఖ సీఐ బద్యానాద్ చౌహాన్ మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలు, తండాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామన్నారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో చారకొండ మండలం నుంచి ఇరివ్సన్‌కు బైక్‌పై వెళ్తున్న మాడ్గుల మండల సంద్రలగడ్డకు చెందిన సబావత్ దేవ్లాను తనిఖీ చేయగా 6లీటర్ల నాటు సారా లభ్యమైందన్నారు. సారాతో పాటు బైక్‌ను సీజ్ చేసి దేవ్లాను అరెస్టు చేశామన్నారు. నాటు సారా కేసుల్లో నిందితులుగా ఉన్న మరో ఏడుగురిలో మాడ్గుల తహసీల్దార్ వద్ద ముగ్గురిని, తలకొండపల్లి తహసీల్దార్ వద్ద ఒకరిని, కడ్తాల్ తహసీల్దార్ వద్ద ముగ్గురిని బైండోవర్ చేశామని తెలిపారు.

హత్య కేసులో ముగ్గురికి రిమాండ్

కందుకూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన హత్యలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ శ్రావణ్ తెలిపిన వివరాలు.. కొత్తగూడలోని పుట్టింట్లో ఉంటున్న భార్య స్వప్న వద్దకు.. హైదరాబాద్‌లో ఉంటున్న భర్త కంచుకట్ల పరమేశ్ గత బుధవారం రాత్రి వచ్చాడు. భార్యాభర్తల మధ్య కొన్నాళ్లుగా వివాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తన వద్దకు వచ్చిన భర్తపై.. స్వప్న తన తల్లి చుక్కమ్మతో కలిసి కర్రలతో దాడి చేశారు. దీంతో అతడు మృత్యువాత పడ్డాడు. అనంతరం మృతదేహాన్ని గ్రామంలోని ఓ వ్యవసాయ పొలం వద్ద పడేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు స్వప్న, చుక్కమ్మతో పాటు మృతదేహాన్ని తరలించడంలో సాయపడిన బండారి లలితను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

తల్లీబిడ్డ క్షేమం



పుట్టిన బిడ్డను చూపిస్తున్న 108 సిబ్బంది

కొందుర్గు: పురిటి నొప్పులు వచ్చిన ఓ మహిళను ఆస్పత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే ప్రసవించిన సంఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డిఘనాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి పద్మ శుక్రవారం సాయంత్రం నుంచి పురిటి నొప్పులతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది ఆమెను కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా పురిటి నొప్పులు అధికమై మార్గమధ్యలోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్టు సిబ్బంది సాయికృష్ణ, యాదయ్య తెలిపారు.

వైఎస్‌ఆర్ జయంతిని జయప్రదం చేయండి

తెలంగాణ కమ్యూనిటీ పారామెడికల్ ఐక్య వేదిక పిలుపు



డాక్టర్ అశోక్

ఇబ్రహీంపట్నం రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని తెలంగాణ కమ్యూనిటీ పారామెడికల్ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఉక్కుల అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 8న మహనీయుడి జయంతిని జరుపుకొందామని తెలిపారు. వైఎస్‌ఆర్ ఆర్‌ఎంపీ, పీఎంపీలకు చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. అప్పటి ప్రభుత్వం హయాంలో జీవో నంబరు 1273 ప్రకారం కమ్యూనిటీ పారామెడికల్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి ఆర్‌ఎంపీ, పీఎంపీ కుటుంబాల బతుకులకు భరోసా కల్పించిన గొప్ప నాయకుడని గుర్తు చేశారు. జన హృదయ నేత జయంతిని ఘనంగా నిర్వహిద్దామని కోరారు. పేద ప్రజలకు నిత్యావసర సరుకులు, దుస్తువులు, రక్త దాన శిబిరాలు, పుస్తకాల పంపిణీ, రోడ్ల కు ఇరువైపులా మొక్కలు నాటడం, అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేయడం లాంటి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అన్ని ఫస్ట్‌ఎయిడ్ కేంద్రాల్లో ఉచిత సేవలందించాలని పిలుపునిచ్చారు. పీఎంపీ, ఆర్‌ఎంపీలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఆడపడచులకు వాటా ఇచ్చాడని..

- కన్నతండ్రిపై దాడి చేసిన కొడుకులు
- ఉస్మానియాలో చికిత్స పొందుతున్న బాధితుడు
- ఇద్దరు కుమారులకు రిమాండ్



పోలీసుల అదుపులో నిందితులు మెండె రమేశ్, నర్సింహ

కడ్తాల్: అందరూ తన బిడ్డలేనని భావించిన ఓ తండ్రి.. ఇద్దరు కుమారులతో పాటు.. కొంత ఆస్తిని ఇద్దరు కూతుళ్లకు సైతం ఆస్తిని పంచాడు. ఇది మనసులో పెట్టుకున్న కుమారులు తండ్రిపై కక్ష పెంచుకుని దాడిచేయడంతో పాటు తీవ్రంగా గాయపర్చారు. ఈ ఘటన కడ్తాల్ మండల పరిధిలోని రావిచేడ్‌లో శుక్రవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రావిచేడ్‌కు చెందిన మెండె వెంకటయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్ల సంతానం. అందరికీ వివాహాలు జరిగాయి. ఇదిలా ఉండగా వెంకటయ్యకు గ్రామ సమీపంలో నాలుగు ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. ఇందులో మూడెకరాల పొలాన్ని కుమారులైన రమేశ్, నర్సింలుకు రిజిస్ట్రేషన్ చేయించాడు. మిగిలిన ఎకరా పొలాన్ని కూతుళ్లయిన మంగమ్మ, సునీతకు చెరో అర ఎకరం రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇది నచ్చని కుమారులు తండ్రితో గొడవ పడ్డారు. ఈ విషయమై పలుమార్లు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఎంతకీ వినకపోవడంతో తండ్రిపై కక్ష పెంచుకున్న కొడుకులు గత జూన్ 20న వెంకటయ్యపై దాడి చేశారు. కాళ్లు, చేతులు విరగ్గొట్టి తీవ్రంగా గాయపర్చగా ప్రస్తుతం బాధితుడు ఉస్మానియాలో చికిత్స పొందుతున్నాడు. వెంకటయ్య కూతురు మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం నిందితులిద్దరినీ అరెస్టు చేసి, ఆమనగల్లు కోర్టులో హాజరుపర్చారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

వివాహిత బలవన్మరణం

కొత్తూరు: ఉరేసుకుని ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఉమాశంకర్, ప్రియాంక(26) దంపతులు. జీవనోపాధి కోసం పట్టణానికి వచ్చి సాయికృష్ణ మినీ ఫంక్షన్‌హాల్ కింద అద్దెకు ఉంటున్నారు. భర్త ఉదయం ఓ పరిశ్రమలో విధులకు వెళ్లగా మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుంది. గమనించిన పక్క గది వారు భర్తకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం వారు కిందకు దించగా అప్పటికే ఆమె మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నల్లమల స్టడీ టూర్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి



అమ్రాబాద్‌లో గిరిజనులతో కలిసి మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నల్లమలను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అటవీ ప్రాంతంలోని పర్యాటక ప్రదేశాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, అధికారులు శుక్రవారం నల్లమలలో పర్యటించారు. ఈ టూర్‌కు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం నల్లమలలో లెకో, టెంపుల్, రివర్ టూరిజం సమూహాల అభివృద్ధితో పాటు వసతుల కల్పనపై కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటక అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక యువతకు ఉపాధి వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు రెండు రోజుల పాటు టూర్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా అచ్చంపేటలోని ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో దర్శనం, మన్ననూర్‌లోని ఈఈసీ, ప్లాస్టిక్ రీసైక్లింగ్ సెంటర్, బయోల్యాబ్‌లతో పాటు మల్లెల తీర్థం జలపాతం, ఆక్టోపస్ వ్యూపాయింట్‌లను పరిశీలించారు. వనమహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

త్వరలో నూతన పారిశ్రామిక విధానం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

సాక్షి, సిటీబ్యూరో: పరిశ్రమలకు సంబంధించిన అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని, తమది పరిశ్రమలకు అనుకూలమైన ప్రభుత్వమని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు తెలిపారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఇండస్ట్రీ, ఇన్నోవేషన్, ఇండ్యుజువల్ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి 'వార్షిక ఎక్సలెన్స్ అవార్డు-2023'లను శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అందించారు. కేఎల్‌ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రకటించిన రూ.3700 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఇంకా పంపిణీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని పరిశీలిస్తుందని అన్నారు. మూడు నాలుగు వారాల్లో నూతనంగా పటిష్టమైన పారిశ్రామిక విధానాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా భవిష్యత్తులో మొట్టమొదటి ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈ పాలసీని ఆవిష్కరించనుందని అన్నారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి, ప్రపంచానికి రాష్ట్రాన్ని స్కిల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి పేర్కొన్నారు. అనంతరం ఎఫ్‌టీసీసీఐ కృషిని ఎంపీ డాక్టర్ మల్లు రవి అభినందించారు. అంతేకాకుండా ఎంపీగా అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. పారిశ్రామిక అభివృద్ధి లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీసీసీఐ భవన నిర్మాణానికి రెండు ఎకరాల భూమి కేటాయించాలని సంస్థ అధ్యక్షుడు మీలా జయదేవ్ కోరారు.

అతివేగానికి నిండు ప్రాణం బలి

- బైక్‌ను ఢీకొట్టిన కారు, ఒకరి మృతి



రెండు కార్ల మధ్య ఇరుక్కుపోయిన బైక్

కందుకూరు: బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ఓ యువకుడు స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో విగతజీవిగా మారాడు. బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం లింగసానిపల్లికి చెందిన సంపంగి మల్లయ్య(33) కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటూ బాలాపూర్ చౌరస్తాలో రాయి పనులు చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో మండల పరిధిలో శ్రీశైలం రహదారిపై దెబ్బడగూడ గేట్ సమీపంలోని మయూరి పైపుల ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా రాంగ్ రూట్‌లో అతివేగంగా వస్తున్న ఓ కారు మల్లయ్య బైక్‌తో పాటు వెనక వస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి రోడ్డు పక్కకు ఎగిరిపడ్డ మల్లయ్య తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని బైక్ రెండు కార్ల మధ్య ఇరుక్కుపోయింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.